నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: మూసాపేట 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈనెల 24న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ భీమ లింగప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10.30 వరకు ప్రగతినగర్, సాయిబాబా ఆలయం, వసుంధర ఆసుపత్రి ప్రాంతం. 10 నుంచి 11.30 గంటల వరకు ఆంజనేయనగర్, జనతానగర్, మూసాపేట గూడ్స్ షెడ్‌రోడ్డు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాలాజీనగర్, న్యూ బాలాజీనగర్, సాయిబాబా ఆలయం, రామ్‌దేవ్‌రావ్ ఆసుపత్రి, వివేక్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మర్యాదపూర్వక కలయిక



ఏసీపీ నరేశ్‌రెడ్డితో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన పి. నరేశ్ రెడ్డిని డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బాలానగర్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాజా, సీనియర్ నాయకులు మందడి సుధాకర్‌రెడ్డి, పంజా రాంచందర్ ముదిరాజ్, మొహమ్మద్ బాబా, ఎలిజాల యాదగిరి, సింగజోగి రామేశ్వర్, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

మహిళలకు సన్మానం



మహిళలను అభినందించిన ఆలయ చైర్మన్ ధర్మారావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్ కాలనీలోని పలువురు మహిళలు షిర్డీలోని ఆలయం వద్ద లలితా పారాయణంతో పాటు కోలాటం ఆడి భక్తులను తన్మయత్వం చెందించారు. దీంతో ఆలయ నిర్వాహకులు మహిళలకు సర్టిఫికెట్లతో పాటు నటరాజస్వామితో కూడిన బహుమతులు అందించారు. కాగా కాలనీలోని వీరాంజనేయ శివాలయం చైర్మన్ ధర్మారావు మహిళలను శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ప్రభాకర్, సెక్రటరీ తిరుపతి రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో మరిన్ని సేవలు..!

- జిల్లాలో మొదటి విడతలో 67 ఆరోగ్య కేంద్రాల్లో మరూ
- పీఎస్‌లు, పల్లె, బస్తీ దవాఖానాల్లోనూ దశలవారీగా 6 రకాల సేవలు
- 'ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్'లతో మరింత ప్రయోజనం



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ దవాఖానాల్లో (ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్)లలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలతో పాటు మరిన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి.

వైద్యులకు శిక్షణ పూర్తి..

జిల్లావ్యాప్తంగా 103 ఆరోగ్య ఉప కేంద్రాల్లోని 70 కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చారు. కొత్తగా మరో 112 బస్తీ దవాఖానాలను పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. వాటిలో ఎంబీబీఎస్ వైద్యుడితో పాటు స్టాఫ్ నర్సును నియమించి కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్'లుగా నామకరణం చేసింది. ఈ ఆసుపత్రుల్లో మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ, అంటువ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధులకు చికిత్సతో పాటు అసంక్రమిత వ్యాధుల బారిన పడిన వారికి మాత్రలు అందజేస్తోంది. ఇక్కడ అందుబాటులో లేని సేవల కోసం సమీప జిల్లా కేంద్ర ఆసుపత్రి, ఏరియా, సీఎంసీలకు తరలించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

విడతల వారీగా..

ప్రస్తుతం సాధారణ వైద్య సేవలతో పాటు కంటి చూపు, ముక్కు, గొంతు, చెవి, దంత సమస్యలు, మానసిక సమస్యలు, ఎలర్జీతో బాధపడే వారికి సైతం చికిత్స అందిస్తున్నారు. ఇందుకు సంబంధించి గతంలో జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నిపుణుల ద్వారా వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మొదటి దశలో ప్రస్తుతం ఉన్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్‌లో మూడో వంతు అంటే 67 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరు రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మొత్తంగా మూడు విడతల్లో ప్రత్యేక సేవలు విస్తరించడంతో పాటు ప్రాథమిక వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు అనుసంధానం చేస్తారు.

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు

జిల్లా ఆసుపత్రి: మల్కాజిగిరి (డీహెచ్)
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు : 04
పీహెచ్‌సీలు : 12 (11 డెలివరీ పాయింట్స్)
యూపీహెచ్‌సీఎస్: 26 (6 డెలివరీ పాయింట్స్)
24 గంటల దవాఖానాలు:
12 (8 పీహెచ్‌సీఎస్, 5యూపీహెచ్‌సీఎస్)
బస్తీ దవాఖానాలు: 112
ఆరోగ్య ఉపకేంద్రాలు:
103 (ఇందులో 70 పల్లె దవాఖానాలు)

అవసరమైతే ఇతర ఆసుపత్రులకు..

రోగులకు వైద్యం విషయంలో వైద్యావిధాన పరిషత్ వైద్యులు తోడ్పాటును అందించడంతో పాటు ప్రతీ నెలలో 2 రోజులు ఆయా ఆసుపత్రులను సందర్శించి గుర్తించిన రోగులకు చికిత్స అందేలా చూస్తారు. అవసరమైన వారిని సమీప జిల్లా ఆసుపత్రి, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రికి పంపిస్తారు.

ప్రజలకు ఎంతో ప్రయోజనం..

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్లలో వైద్య సేవలు విస్తరించడంతో బస్తీ, పల్లె ప్రజలకు వైద్యం మెరుగవుతోంది. ఈ ప్రత్యేక వైద్య సేవల్లో భాగంగా ప్రజలకు ఆరుకు పైగా సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైద్యశాఖ పర్యవేక్షణ కూడా ఉంటోంది. మూడు విడతల్లో ప్రత్యేక వైద్య సేవలు విస్తరిస్తాం.

– డాక్టర్.ఉమాగౌరీ, డీఎంహెచ్ఓ, మేడ్చల్–మల్కాజిగిరి

మేనిఫెస్టో విడుదల



మోతీనగర్: మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ అభివృద్ధే లక్ష్యంగా డెవలప్‌మెంట్ కమిటీ పేరిట ఎన్నికల బరిలో ఉన్నామని మోతీనగర్ అభివృద్ధి కమిటీ ఎన్నికల అభ్యర్థులు పేర్కొన్నారు. ఈ మేరకు తమ మేనిఫెస్టోను మోతీనగర్‌లోని శివరామ ఆంజనేయ ఆలయంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్యానెల్ డాక్టర్ ఎస్.వి. ప్రసాద్ పర్యవేక్షణలో ఈనెల 28న జరగనున్న ఎన్నికల్లో కమిటీ విజయం సాధిస్తుందని పలువురు సభ్యులు ధీమా వ్యక్తం చేశారు.

యూకే రాయల్ సొసైటీ ఫెలోగా ప్రొ.జగదీష్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ చెన్నుపాటి జగదీష్ యూకేలోని రాయల్ సొసైటీ ఫెలో(ఎఫ్ఆర్ఎస్)గా ఎన్నికయ్యారు. హెచ్‌సీయూలోని ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ చైర్ ప్రొఫెసర్ జగదీష్‌కు ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది.నానోటెక్నాలజీ, సెమీకండక్టర్ ఆప్టో ఎలక్ట్రానిక్స్, ఆప్టో ఎలక్ట్రానిక్ అప్లికేషన్ల కోసం కొత్త రకాల ఎల్ఈడీలు, లేజర్లు, నానో పరికరాల అభివృద్ధికి కృషి చేశారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

ఆల్విన్‌కాలనీ: దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలోని బాలాజీ బ్లిస్ వద్ద నెలకొన్న సమస్యలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన పనులపై అధికారులు, కాలనీవాసులతో శుక్రవారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసరం ఉన్న చోట ముందుగా పనులు చేపట్టి త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు.



కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహాదేవ్, అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

హెచ్ఏఎల్ కార్మికుడికి సన్మానం



కార్మికుడిని సన్మానించిన హెచ్ఏఎల్ చీఫ్ మేనేజర్ రమేశ్ బాబు, కార్మికులు

కూకట్‌పల్లి: హెచ్ఏఎల్‌లో పనిచేస్తున్న కార్మికుడు సింగూరి ప్రసాద్ బాబు ఈనెలలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో టూల్ రూమ్ డిపార్టుమెంట్ కార్మికులు ప్రసాద్‌బాబును శుక్రవారం శాలువాతో సన్మానించి పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఏఎల్ చీఫ్ మేనేజర్ రమేశ్ బాబు, సీనియర్ మేనేజర్ రాజా ప్రశాంత్, వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు, క్రాంతి కుమార్, నవీన్, ముజీబ్, సత్యనారాయణ, చలం, సుదర్శన్, శ్రీకాంత్, శివ, రవిసుందర్, రాజ్‌కుమార్ గౌడ్, లక్ష్మణ్‌రాజు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం..!

ఆల్విన్‌కాలనీ: తులసీనగర్‌లోని జీవన్‌జ్యోతి స్కూలు పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పడకేసింది.కొందరు చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి అక్కడే పడేస్తుండగా నెలల తరబడి అలాగే ఉంటోంది. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అసలే వర్షాకాలం సమీపిస్తోందని పరిస్థితులు ఇలాగే రోగాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.



తులసీనగర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఎమ్మెల్యేకు వినతి

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియనగర్ 5వ ఫేజ్‌లో రోడ్డు ఆక్రమించి, ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న భవనంపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని శుక్రవారం జనప్రియనగర్ 5వ ఫేజ్ కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ జనప్రియనగర్‌లో సుమారు 650 కుటుంబాలుంటున్నాయని వివరించారు. తప్పుడు పత్రాలతో జీహెచ్ఎంసీ అనుమతులు పొంది ఇష్టానుసారంగా భవనం నిర్మిస్తున్నారన్నారు. 16 రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నామని ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు వేణుగోపాల్‌రావు, శేఖర్‌రెడ్డి, రవికుమార్, రామకిషన్‌రావు, రామాంజనేయులు, చిన్నబాబు, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

కుత్బుల్లాపూర్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి అన్నారు. జీడిమెట్ల గ్రామంలోని బస్తీ దవాఖానాలో డాక్టర్ అనుపమా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జన ఆరోగ్య కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దవాఖానాలో నెలకొన్న సమస్యలు తెలుసుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి, జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు జోగిని రాజు, శివ, తదితరులు పాల్గొన్నారు.